ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీ

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 27: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసి ఇటీవల మృతిచెందిన కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ కుటుంబాలకు రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందజేశారు.ఆర్మ్‌డ్ విభాగం కానిస్టేబుల్ డీ మల్లయ్య కెనాల్ కాలువ నీటిలో మునిగి మృతి చెందగా, టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ బీ సోమరాజు గుండెపోటుతో మృతి చెందారు. మల్లయ్య భార్య హేమలత, కుమార్తె శ్రీజకు రూ. 8 లక్షల చెక్కు, బీ సోమ రాజు భార్య శోభారాణి, కుమార్తె సాయి ప్రియకు రూ. 15,99,160 విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. బాధిత పోలీస్ కుటుంబాలకు డిపార్ట్‌మెంట్ అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఏవో అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ సంధ్య ఉన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

పెద్దపల్లి, ఏప్రిల్27: తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, అభివృద్ధి, సంక్షేమం కోసం పుట్టిందే బీఆర్ఎస్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో శనివారం బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకముందు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడారు. తెలంగాణ ప్రజలను ఐక్యం చేసి

పెద్దపల్లిలోని తెలంగాణ భవన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి, నాయకులు

ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాల ప్రజలకు అండగా నిలిస్తూ, ప్రజాసంక్షేమం, అభివృద్ధికి ఆనాటి ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్‌రావు కృషి చేశారని తెలిపారు. రాష్ట్రాన్ని దేశంలో గొప్పగా తీర్చిదిద్దిన మహా నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలు, హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి, ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే దాకా బీఆర్ఎస్ శ్రేణులు పోరాటం చేస్తారని చెప్పారు. 14 ఏండ్లు పోరాడి రాష్ట్రాన్ని తెచ్చిన ఘనత కేసీఆర్‌దేనని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కొనియాడారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టి తొమ్మిదిన్నరేండ్లు ప్రజల ఉన్నతికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, నాయకులు పీటీ స్వామి, మేడి సది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండావిష్కరణ

రామగిరి, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కల్వచర్లలో పార్టీ జెండాను ఎగుర వేశారు. స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు జాపతి శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు బొంకూరి పోచం, రేండ్ల కుమారస్వామి, మెట్టు కిష్టయ్య, దాసరి సంపత్, ఆసం ప్రభాకర్, బూడిద రాము, కన్నూరి ఓదెలు, ఆసం నర్సయ్య ఉన్నారు.

పలు గ్రామాల్లో మంత్రి పర్యటన

ముత్తారం, ఏప్రిల్ 27: ముత్తారం, మచ్చుపేట, మైదంబండ, పోతారం, హరిపురంలోని పలు ఆలయాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శనివారం దర్శించుకొని మొక్కులు చెల్లించారు. హరిపురం గ్రామానికి చెందిన చెనవేన శిరీష ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 463 మార్కులు సాధించగా ఆమెను సన్మానించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీలు నాగినేని జగన్ మోహన్ రావు, చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించాలి

కోల్‌సిటీ, ఏప్రిల్ 27: భూగర్భ జల మట్టం పెరగడానికి ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని రామగుండం కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు క్షీణించి పోయి ప్రమాద స్థాయి చేరుకోకముందే అప్రమత్తం కావాలని ఆయన కోరారు. ఇంకుడు గుంత నిర్మించుకోవడం వల్ల వ్యర్థమైన నీరు భూమిలోకి ఇంకి పరిసరాలు కలుషితం కాకుండా ఉంటాయని అన్నారు. మరి కొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పాత ఇంకుడు గుంతలను పునరుద్ధరిస్తుండడంతో పాటు వాన నీటి సంరక్షణ కోసం మరికొన్ని చోట్ల సామూహిక ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నూతన పురపాలక చట్టం-2019 ప్రకారం ఇంకుడు గుంత నిర్మాణం చేసేలా ఇంటి ప్లాన్ ఉంటేనే భవన నిర్మాణానికి అనుమతి ఇస్తామని చెప్పారు. నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలలో ఇంకుడు గుంత ఉంటేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తామని చెప్పారు. ఇంకుడు గుంతల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టేలా ప్రజల్లో అవగాహన కల్పించడానికి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బోర్లు, బావులు ఉన్న వారు నీరు వృథా చేయొద్దని, పొదుపుగా వాడాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ఫ్లై ఓవర్‌పై ట్రయల్ రన్ ప్రారంభం

పాలకుర్తి, ఏప్రిల్27: బసంత్‌నగర్ సమీపంలో రాజీవ్ రహదారిపై నిర్మించిన రైల్వేఫ్లై ఓవర్‌పై నుంచి వాహనాల రాకపోకలకు హెచ్‌కేఆర్ సంస్థ శనివారం అనుమతించింది. రాజీవ్ రహదారి ఫోర్‌లేన్ రోడ్డు నిర్మించిన హెచ్‌కేఆర్ సంస్థ బసంత్‌నగర్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం జాప్యం చేసింది. గత ప్రభుత్వం తీవ్రస్థాయిలో రైల్వేశాఖ, హెచ్‌కేఆర్ సంస్థపై ఒత్తిడితీసుకువచ్చింది. దీంతో కాంట్రాక్టర్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. బసంత్‌నగర్ వద్ద ఫోర్ లేన్ రోడ్డు, ఫ్లై ఓవర్ లేక, డబుల్‌రోడ్డులోనే రెండువైపుల వాహనాలు నడిచేవి. దీంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. అప్పటి ఎమ్మెల్యే కోరుకంటిచందర్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. ఏడాది నుంచి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుదీర్ఘకాలం నిరీక్షణ అనంతరం బసంత్ నగర్ వద్ద నూతన ఫ్లై ఓవర్ ప్రారంభం కావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ట్రయల్‌రన్ మాత్రమే నడిపిస్తున్నామని, ఎన్నికల కోడ్ అనంతరం అధికారికంగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఓదెల, ఏప్రిల్ 27: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పెద్దపల్లి నియోజకవర్గ ఏఆర్వో, ఆర్డీవో గంగయ్య శనివారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, పోలింగ్‌కు అనువైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ యాకన్న, గిర్దావర్లు బండ రాజేందర్, నర్సింగం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ధాన్యం తూకంలో పారదర్శకత పాటించాలి

జూలపల్లి : కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

జూలపల్లి, ఏప్రిల్ 27 : వెంకట్రావ్‌పల్లి, వడ్కాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ శనివారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఎఫ్ఏక్యూ పారమీటర్స్ పరిశీలించచి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల నిర్వహణ తీరు, రిజిష్టర్లు, రశీదులను పరిశీలించారు. కేంద్రాల వద్ద తప్పకుండా తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం తూకంలో పారదర్శకత పాటించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇక్కడ తాసిల్దార్ బషీరొద్దీన్, జిల్లా పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీకాంత్, ఆర్ఐ స్రవంతి, సొసైటీ సీఈవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎలిగేడు, ఏప్రిల్ 27: ధాన్యం కొనుగోలులో ఎఫ్‌సీఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, అదే క్రమంలో రైతులకు మద్దతు ధర లభించేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అధికారులకు సూచించారు. ధూళికట్ట, ఎలిగేడులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అధికారులు, రైతులతో మాట్లాడారు. తూకం వేసిన ధాన్యాన్ని రికార్డుల్లో నమోదు చేసి వెంటనే మిల్లులకు తరలించాలని, మిల్లులలో కోతలు లేకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రల వద్ద ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు ప్యాడీ క్లీనర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఇక్కడ జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ జే స్వర్ణ అధికారులు రైతులున్నారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్
మాధవరావుకు బెయిల్

- కరీంనగర్ జిల్లా జైలు నుంచి విడుదల
- చొరవ చూపిన మాజీ సీఎం కేసీఆర్, పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల
- కృతజ్ఞతలు తెలిపిన మాధవరావు, సోదరి, తల్లిదండ్రులు

జైలు నుంచి విడుదలైన తర్వాత సోదరి మాధవితో మాధవ రావు

ధర్మారం, ఏప్రిల్ 27: పోలీసుల అక్రమ కేసులో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ప్రధాన కార్యదర్శి సల్వాజీ మాధవరావుకు బెయిల్ వచ్చింది. శనివారం సాయంత్రం కరీంనగర్ జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. గత మార్చి 18న సల్వాజీ మాధవ రావుపై యూత్ కాంగ్రెస్ నాయకుడు సోగాల తిరుపతి దాడి చేయడమే కాకుండా ఎస్సీ కులం పేరిట దూషించారని ఫిర్యాదు చేయడం, పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. దాడి చేసిన తిరుపతిపై మాధవరావు ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదు. కేసు నమోదు చేయలేదు. ఈ క్రమంలో ఈ నెల 3న పెద్దపల్లి ఏసీపీ జీ క్రిష్ణ సాక్షులను విచారించి, కులం పేరిట దూషించినట్లుగా నిర్ధారించడంతో మాధవరావును పోలీసులు ఈ నెల 12న అరెస్ట్ చేశారు. నంది మేడారం జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరుచగా, ఈ నెల 25 వరకు రిమాండ్ విధించడంతో కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. అయితే మాధవరావును విడిపించేందుకు పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు బెయిల్ మీద విడుదల చేయిస్తానని అభయమిస్తూ వచ్చారు. తాజాగా రెండ్రోజుల క్రితం మాధవరావు కుటుంబాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు టీం రాష్ట్ర అధ్యక్షుడు హరీశ్ వర్మ పరామర్శించారు. ఈ సమయంలో మాధవరావు సోదరితో ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడారు. ధైర్యం చెప్పారు. ఎట్టకేలకు 15 రోజుల తర్వాత మాధవరావు జైలు నుంచి విడుదలయ్యారు.

కుట్ర కేసు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం

బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ మాధవరావుపై పోలీసులు కుట్ర కేసు నమోదు చేయడంపై ఈ నెల 16న సంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాజీ సీఎం కేసీఆర్ ప్రస్తావించడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు మాధవరావును అరెస్ట్ చేస్తారా..? మీకిది న్యాయమా..? అంటూ కేసీఆర్ ఆ వేదిక నుంచి డీజీపీని ప్రశ్నించడం, అక్రమ కేసులు బనాయించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే న్యాయస్థానం తలుపు తడుతామని కేసీఆర్ ఆ సభలో మాట్లాడడంతో మాధవ రావు కుటుంబానికి కొండంత ధైర్యం వచ్చింది. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కృషి పార్టీ లీగల్ సెల్ చొరవతో మాధరావుకు బెయిల్ వచ్చింది. కాగా, వారందరికీ మాధరావుతో పాటు అతని తల్లిదండ్రులు రాజవ్వ, మారుతీ రావు, సోదరి మాధవి కృతజ్ఞతలు తెలిపారు.

బెయిల్ మంజూరైన రోజే కొడుకు జననం

మాధరావుకు కోర్టు నుంచి శుక్రవారం బెయిల్ కన్‌ఫర్మ్ కాగా, అదేరోజు మధ్యాహ్నం అతని భార్య శిరీష కరీంనగర్‌లో మగ శిశువుకు జన్మనిచ్చింది. అడ్వకేట్ ఆకారి రాజేశం అన్ని పత్రాలు కోర్టు ద్వారా సమర్పించడంతో శనివారం సాయంత్రం జైలు నుంచి మాధవరావు విడుదలయ్యారు.

కేటీఆర్‌ను కలిసిన మంథని నాయకులు

మంథని రూరల్, ఏప్రిల్27: బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంథని యువజన విభాగం సీనియర్ నాయకుడు కాసిపేట సాగర్, పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

జూలపల్లిలో జాబ్ మేళా

జూలపల్లి, ఏప్రిల్ 27 : హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీలో ఉద్యోగాల కల్పనకు జూలపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఐదు రౌండ్లలో ప్రతిభ చూపిన అభ్యర్థులను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. సంస్థలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు వేతనంతోపాటు, ఉచితంగా డిగ్రీ చదివిస్తామని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఇక్కడ హెచ్ఆర్ రాజశేఖర్, రాంబాబు, నిజామొద్దీన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్27: తారుపల్లి, మల్యాల, జగ్గయ్యపల్లె, పెగడపల్లి, వెన్నంపల్లికి చెందిన పలువురు వివిధ కారణాలతో మృతి చెందగా, బాధిత కుటుంబాలను పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఎంపీపీ నూనేటి సంపత్, నాయకులు నిదానపురం దేవయ్య, బూసి సదాశివ రెడ్డి,గౌడుగు రాజకొమురయ్య, జక్కె రవీందర్, నూనేటి కుమార్, కూకట్ల నవీన్, కామిడి వెంకట్‌రెడ్డి, లోనె శ్రీనివాస్, ఎరబాటి రవి, విష్ణువర్దన్‌గౌడ్, మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ ఉన్నారు.

ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్‌ను నిలదీయాలె

ముత్తారం : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

ధర్మారం : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ముత్తారం, ఏప్రిల్ 27: అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల పేరిటి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నదని జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ విమర్శించారు. ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రామకృష్ణాపూర్, సీతంపల్లిలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు రాగానే ఆ పథకాలను అమలు చేస్తామంటూ ప్రజలను మభ్యపెడుతున్నదని మండిపడ్డారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలు నిలదీయాలనారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేస్తే ఆగమైపోతామని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను ఆశీర్వదించాలని కోరారు. గతంలో మంత్రిగా ఈ ప్రాంతానికి ఎనలేని సేవలు చేశారన్నారు. వారసత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పాలన్నారు. ప్రజాసేవ, అభివృద్ధిని ఆకాంక్షించే ఈశ్వర్‌ను ఆశీర్వదించి ఆదరించాలని కోరారు. ఇక్కడ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, మాజీ సర్పంచ్ లు నూనె కుమార్ , ఉప్పు సుగుణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొప్పులను భారీ మెజార్టీతో గెలిపించాలి

మంథని, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. మంథని పట్టణంలోని 2వ వార్డు హనుమాన్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంచుతూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బత్తుల సత్యనారాయణ, గర్రెపల్లి సత్యనారాయణ, కాయితి సమ్మయ్య, గొబ్బూరి వంశీ, ఎంఎస్ రెడ్డి, మాచిడి రాజుగౌడ్, ఆడిచర్ల సమ్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈశ్వర్‌ను గెలిపించాలి

మంథని రూరల్, ఏప్రిల్27: పెద్దపల్లి లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మంథని మండల బీఆర్ఎస్ నాయకులు కోరారు. కాకర్ల పల్లె, మైదుపల్లిలో ఎన్నికల ప్రచారం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయిస్తే వెంకటస్వామి కుటుంబమే రిజర్వేషన్ అనుభవిస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఇక్కడి ప్రజలతో అనుబంధం లేదని, ప్రజల కష్టా సుఖాలు పట్టించుకోరన్నారు.బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఇక్కడ సింగరేణి కార్మికుడిగా పనిచేశారన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు వేల్పుల గట్టయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పెట్టెం రామస్వామి, ఎంపీటీసీలు ఓదెలు, ప్రసాద్ రావు, మాజీ సర్పంచ్ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు

కమాన్‌పూర్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గడప గడపకూ బీఆర్ఎస్ ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు వస్తేనే కాంగ్రెసోళ్లకు పథకాలు గుర్తుకొస్తాయని, ఎన్నికల తర్వాత వాటి అమలును దాటవేస్తారని, అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఎందుకు చేయలేదో ప్రజలు ఆలోచన చేయాలన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించండి

మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ మండల నాయకులు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ తగ్గలేదన్నారు. ఆరు గ్యారంటీలతోపాటు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకుండా వాయిదాలు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ రాచకొండ లక్ష్మీ రవి, వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, మాజీ జడ్పీటీసీ మేకల సంపత్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాద్రపు మల్లేశ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, నాయకులు నీలం సరిత, లక్ష్మీమల్లు, మల్లేశ్, భూమయ్య, తాటికొండ శంకర్, కొండ వెంకటేశ్, సాయి కుమార్, రాచకొండ రవి, నీలం శ్రీనివాస్, ఆకుల గట్టయ్య, పిట్టల తిరుపతి, ఆకుల రమేశ్, గసిగంటి అజయ్, లింగస్వామి, లింగన్న, శంకర్ గౌడ్, సది, శ్రీనివాస్, ప్రశాంత్, రాము, రాజ్‌కుమార్, సతీశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు ప్రచారం

ధర్మారం,ఏప్రిల్27:పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. రచ్చపల్లి,చింతలపల్లి,రామయ్యపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ,ప్యాక్స్ చైర్మన్‌లు ముత్యాల బలరాంరెడ్డి,నోముల వెంకట్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గుర్రం మోహన్ రెడ్డి,పార్టీ సీనియర్ నేత పూస్కూరు జితేందర్‌రావు,పార్టీ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, రచ్చపల్లి ఎంపీటీసీ బెల్లాల రోజారాణి లక్ష్మణ ప్రసాద్,పార్టీ మహిళ నాయకురాళ్లు గుజ్జేటి కనకలక్ష్మీ,మోకెనపల్లి రాజమ్మ,కాంపెల్లి అపర్ణ, మర్రి మమత,నాయకులు మూల మల్లేశం, బైరీ సురేశ్, గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్ల రాజయ్య,కత్తెర్ల రాజేందర్ పాల్గొన్నారు.

కండ్ల ముందే పొలం కాలిబూడిద

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 27 : ఆరుగాలం కష్టపడి పండించిన పంట కండ్ల ముందే కాలిబూడిదైంది. ప్రమాదవశాత్తు జరిగిందా..? ఎవరైనా కావాలని చేశారా..? తెలియదు గానీ, కోతకు వచ్చిన ఎకరన్నర పొలం అగ్నికి ఆహుతైంది. కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలకు చెందిన పంజాల శంకరయ్య గ్రామ శివారులో ఒక ఎకరం 20 గుంటల వరి పొలం వేశాడు. కోతకు వచ్చిన పొలాన్ని కోద్దామని అనుకున్నాడు. అయితే, శనివారం మధ్యాహ్నం సమయంలో పొలంలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడికి వెళ్లి చూసేసరికి పొలం మొత్తం కాలిపోయింది. కోతకు వచ్చిన పొలం తమ కండ్ల ముందే కాలిపోవడంతో రైతు బోరున విలపించాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ఓంకార్‌యాదవ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

మల్యాలలో అగ్నిప్రమాదంలో దగ్ధమైన పొలం

ప్రమాదంలో సుమారు ₹లక్షా 50 వేల నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

మే 6వరకు పరీక్ష ఫీజు గడువు

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 27: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గోదావరిఖని స్టడీ సెంటర్‌లో డిగ్రీ ఫస్టియర్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు గడువు వచ్చే నెల 6వరకు ఉందని కళాశాల కో ఆర్డినేటర్ సుబ్బారావు, ప్రధానాచార్యులు పీ రాజేశ్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థుల మొదటి సెమిస్టర్ పరీక్ష రుసుం సబ్జెక్టుకు రూ. 50 చెల్లించాలని పేర్కొన్నారు. బీకాం కంప్యూటర్, బీఎస్సీ విద్యార్థులు ఆదనంగా ల్యాబ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్ష మే 26 నుంచి జూన్ 1 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

NAME CHANGE

★Salendri Anil S/o Mallesham H.No. 1-7-8, Ananthapally, Chandurthi Mandal, Rajanna Sircilla my surname was changed as Salendra Anil S/o Mallesham.
NTK-311294

NAME CHANGE

★Bojja Gattu Jyothi W/o Gattu Mohan H.No. 3-37, Ashireddypally, Chandurthi, Rajanna Sircilla Dist. My Name was changed as Gattu Jyothi, W/o Gattu Mohan
NTK-311292

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194